# కుర్చీ

'ఆడా!' అని ఆశ్చర్యపోయాడొకడు.

'అవును ఆడే' అన్నాడు ఇంకొకడు.

'ఆడాడే' అన్నారు మరో ఇద్దరు.

అప్పుడే ఊరుకు తూర్పున చెరువు గట్టున తాతలనాటి రావిచెట్టు కింద ఆగిన కారులోంచి పదవీ తేజస్సుతో కళకళలాడుతూ దిగిన ఓ భారీ పెద్దమనిషిని చూసి చెప్పుకుంటున్నారు. అక్కడ చేరిన గుంపులో ఒకాయన 'చేర్మేనాడు' అన్నాడు. జిల్లా పరిషత్ చైర్‌మెన్‌ని ఆ ఊరుజనం అంతకు ముందెన్నడూ చూడలేదు. తెల్లని దుస్తులతో సిరిగలవాడిలా ఆకర్షిస్తున్న ఆయన్ని చూసి —ఇంతకాలానికి చూడగలిగిన ఆనందంతో, గౌరవంతో, నమ్రతా భావంతో, ఆయన గురించి తలో మాటా అభిమానంగా చెప్పుకుంటున్నారు.

'మనిషి బావున్నాడ్లే' అని ఎత్తయిన బలమైన ఛైర్‌మెన్ విగ్రహాన్ని మెచ్చుకున్నాడు మరొకడు.

ఆయన దిగిన కారులోంచే మరికొందరు ఇన్‌షర్ట్ రాయుళ్లు దిగారు. పంచాయితీ ప్రెశిడెంటూ, గ్రామస్థులయిన కొందరు పలుకుబడి రాయుళ్లూ, వాళ్లను

ఆశ్రయించుకున్న మరికొందరు అనుచరులూ ఆ కారు రాకకోసం ఉదయంనించి ఎదురు చూస్తున్నారు. చివరకు మిట్టమధ్యాహ్నం ఒంటిగంటకు ఆ కారు వచ్చినందుకు వాళ్లు సంతోషపడిపోతున్నారు.

చైర్‌మేన్‌తో ఇంకెవరో పెద్దబాబులు ఉన్నారు. వాళ్లెవరో గ్రామస్థులకు తెలీదు. కలకటేరయి ఉంటాడు అన్నాడొకాయన. మరో ఆయన 'ఛ, కలకటేరేంటి' అంటే, 'తాసీల్దారయి ఉంటా'డన్నాడు వేరొకడు. 'తాసీల్దారు కాడాడు. తాసీల్దారయితే తెల్లా—నుదురు మీద బొల్లి ఆడికి. కిందటి సారి ఆరైతో వచ్చాడు కదా?' అని మరొక రైతు వాదన. మిగిలిన వాళ్లు ఎవరో తెలీకుండా ఉంది. ఒక్కొక్కరు ఒక్కోరకంగా ఊహించుకుంటున్నారు.

ఆ ఊళ్లో సింగిల్ టీచర్ ప్రకాశం చెప్పాడు. ఆ నుదుటి మీది బొల్లి ఆయనకు బదిలీ అయిందనీ, ఈ సూదిముక్కువాడు వారం పది దినాల క్రితమే వచ్చాడనీ. ఆ తెల్లదుస్తులు వాళ్లల్లో ఒకడు బీడీవో అనీ, ఇంకొకడు సమితి ప్రశిడెంటు అనీనూ.

వాళ్లవెంట ఒక చిన్న గుంపు తయారయింది. ముందు తెల్లదుస్తుల వాళ్లూ, వెనక భారీ విగ్రహం చైర్‌మేన్, వాళ్ల వెనక మాసిన రంగురంగుల ముతక గుడ్డల వాళ్లూ, ఆ వెనక మొలవరకు తప్పించి పై ఒంటిమీద గుడ్డలు లేనివాళ్లూ, తలపాగాలవాళ్లూ గుంపుగా వెళ్తున్నారు. చిన్న పిల్లలు ఏమిటో ఏమిటో అన్న ఉత్సాహంతోను, పెద్దలు ఇంత పెద్దప్రమాదం నుండి బాధితులను ఆదుకోవటానికి వచ్చిన అధికారులు ఎలాంటి దారిచూపిస్తారో అన్న ఆశతోనూ ఆ బాబుల వెంట నడుస్తున్నారు.

వెయ్యికి పైగా జనాభా ఉన్న ఆ ఊళ్లో పెద్ద అగ్ని ప్రమాదం జరిగింది. సగం ఇళ్లు కాలి కూలి మసయిపోయాయి. ఆ వీధుల్లో, మొండిగోడలతో, కింద పరుచుకున్న బూడిదతో బోసిగా, ఫైర్ ఇంజన్‌ల సహాయంతో ఆరిన సగం కాలిన దూలాలతో, నల్లగా మాడిపోయిన ఎముకలగూళ్లల్లాంటి చెట్లతో చూసేవాళ్లకు భయంకరంగా కన్పిస్తున్నాయి.

అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఊరు చూట్టానికి వచ్చిన ఆ గుంపును చూస్తూ నుంచున్నాడు రామ్మూర్తి. వాళ్ల వెంబడే వెళ్లబుద్ధికాలేదు. కాలిపోయిన ఆ వీధుల్ని చూస్తుంటే గుండె బరువెక్కి పోయింది. ఆ వెళ్తున్న గుంపులోని తలల మధ్యనించి కుర్చీకాళ్లు పైకి వెల్లకిలా పెట్టి మోసుకుపోతున్న కుర్చీ ఒకటి కనబడుతున్నది. చైర్‌మేన్ మధ్యలో ఎక్కడన్నా కూర్చుంటారేమో అన్న ఆలోచనతో ఆ ఏర్పాటు చేశారు.

మొండి గోడల మధ్య, కాలి దగ్ధమైపోయిన ఆస్తులను తలచుకుని కుంగిపోతున్న వాళ్లు — వీధిల్లోంచి పోతున్న ఈ గుంపునీ, గుంపులో కన్పిస్తున్న కుర్చీనీ చూస్తున్నారు. పొలంలో దిష్టిబొమ్మ ఎలాగయితే కనపడుతుందో, ఆ రకంగా ఆ కుర్చీ ఆ జనంలోని జిల్లా పరిషత్ చైర్‌మేన్‌నీ, తాసీల్దార్‌నీ ఓ పక్కకు తుడిచేసి అందర్నీ ఆకట్టుకొంటున్నది.

జ్యేష్ఠమాసం. చెరువులోని నీళ్లు ఆవిర్లు కక్కుతున్నాయి. ప్రకృతి జ్వాలల నాలుకలను విసురుతున్నది. దానికి తోడు ఈ ఘోరం జరిగింది. దాంతో అక్కడ మనుష్యులు కాలిపోయిన ఆశతో కాంతిహీనంగా కన్పిస్తున్నారు.

కాలిపోయిన ఆ ఇళ్లల్లో బూడిదని ఎత్తిపోస్తూనో, పోయిన వస్తువులను వెతుక్కుంటూనో, తిండీతిప్పలులేని ఆకలిమొఖాలతో కన్పిస్తున్నారు. ఆ విపత్తు వెన్నుపోటుకు నోటమాట రాక పిరిగ్గా గుడ్లప్పగించి చూస్తున్నారు.

అగ్నిమాపకదళం వాహనాలు రావడం మరొక్క అయిదు నిమిషాలు ఆలస్యం అయితే తన ఇల్లుకూడా తగలబడి బూడిదయ్యేదే అనుకున్నాడు రామ్మూర్తి. ఫైర్ ఇంజన్‌లు వచ్చిన తర్వాత కూడా చాలా ఇళ్లు కాలిపోయాయి. వచ్చినవి రెండే ఫైరింజనులు. ఊరంతా భయాందోళనలు. జనం ఏడుపులు, మొత్తుకోళ్లు, హాహాకారాలు, పరుగులు. అగ్నిమంటలు చేరని వీధుల్లో ఇండ్లమీద కుండలతో నీళ్లుపోసి జాగ్రత్తపడుతున్న దృశ్యాలు పదేపదే గుర్తొస్తున్నాయి రామ్మూర్తికి. భగవంతుడు రక్షించి వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పిపోయింది. తన పొరుగు ఇల్లు కాలిపోయింది. సరిగ్గా అప్పటికి ఫైర్‌ఇంజన్ మంటలను ఆర్పుకుంటూ తన ఇంటికి చేరుకుంది. ఆ జ్వాలలు ఎగురుకుంటూ వస్తూంటే, ఫైర్ సర్వీస్ వాళ్లు నీటి ధారలు చిమ్ముతూ ఉంటే వణికిపోయాడు. గుండె కొట్టుకుంది. చెరువులోని నీటినంతా తోడేసి తన ఇంటిమీద పోస్తున్న ఫైర్‌ఇంజన్లు. భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాడు. భగవంతుడా రక్షించావు అనుకున్నాడు. నిట్టూర్చాడు. అయినా భయంగానే ఉంది. మళ్లీ మంటలు ఎక్కడ భగ్గున లేస్తాయో అన్నభయం. మంటలు చల్లారాయి. కాని గుండెల్లోని మంటలు మాత్రం చల్లార లేదు.

రామ్మూర్తి మనసు వికలంగా ఉంది. సగం ఊరు కొద్దిగంటల్లో వల్లకాడయి పోయింది. జనం నిరాశ్రయులైపోయారు. ఊరుకు ఆగ్నేయంగా చెరువుకు దక్షిణంగా మామిడి తోటలో ఉన్న బడిలో జనానికి ఆశ్రయం. అట్లాంటి భవనాలు పది ఉన్నా సరిపోవు. అంత జనం. కోటి రాబందుల్లా వాలింది మంట ఇళ్లమీద. ఎముకల

గూళ్లు మిగిల్చింది.

మండుటెండలో బిక్కుబిక్కు చూపులతో బూడిదను ఎత్తి పోస్తున్న వాళ్లను చూస్తుంటే తనఇల్లు కాలిపోకుండా తప్పిపోవటం అదృష్టమో,దురదృష్టమో తెలీకుండా ఉంది. పదిమందితో నరకమైనా సుఖమే కాని అంతమంది బాధితుల మధ్య ఒంటరి స్వర్గం మాత్రం నరకం కన్నా హీనంగా ఉంది.

"ఆ పెంకుటింట్లో ముగ్గురు పిల్లలు —ఇద్దరు మగపిల్లలూ, ఒక అమ్మాయి —పది, పదమూడు, పధ్నాలుగేళ్లవాళ్లు — పైకప్పుకూలి, కాలిపోయి చనిపోయారు. మంట పెంకుటింటికి రాదని ఆ పిల్లలు వెళ్లి లోపల నిలబడ్డారు. అంతలోనే మంట చుట్టూరా అంటుకుంది. బైటికి రాలేకపోయారు. గగ్గోలు గగ్గోలుగా అరిచారు. ధైర్యంలేక ఎవరూ లోపలకు పోలేకపోయారు. భయంతోనే ఆ పిల్లలు చచ్చిపోయి ఉంటారు. మంటలు దూలాలకు అంటుకుని పైకప్పు కూలిపోయింది. ఫైర్ఇంజన్లు మంటలను ఆర్పేసిన తర్వాత చూస్తే - ఊరంతా కంటనీరు పెట్టింది. ఆ తల్లి దండ్రులు అటుపోకుండా —ఊళ్లో వాళ్లు ఆ కాలిపోయిన శరీరాలను రాత్రి పూడ్చి పెట్టారు." అగ్నిప్రమాదంలో ఈ విషాదకరమైన సంఘటన గురించి చైర్మేన్తో గ్రామ ప్రశిడెంట్ చెపుతున్నాడు.

అక్కడా అక్కడా దుఃఖాన్ని మింగుకోలేక ఏడుస్తున్న ఏడుపులు విన్పిస్తున్నాయి. పొరుగూళ్లనించి బంధువులూ, స్నేహితులూ, ఆప్తులూ పరామర్శకోసం వచ్చి వారిని చూసినప్పుడు దుఃఖం ఉప్పెనలాగ కట్టలు తెగినట్టు ఉప్పొంగి వస్తున్నది. పక్క వీధులు ఏవీ కన్పించేవి కావు. ఇప్పుడు వెనక ఉన్న కాలిపోయిన వీధులన్నీ మొండిగోడలతో ఏ ఆటంకం లేకుండా కన్పిస్తున్నాయి. కాలిపోయిన చెట్లు పైకి ఆకాశంలోకి పొడుచుకుని దిక్కులేని దీనావేదనతో ఉస్సూరు మంటున్నట్టున్నాయి.

"వర్షాలు మొదలయితే పొలం పనులతో తీరిక ఉండబోదని అంతా ధాన్యం మిల్లు చేయించుకుని బియ్యం బస్తాలు ఇళ్లల్లో పెట్టుకున్నారు. అదుగో చూడండి. బియ్యం కాలిపోయి, ఆ మంటలో ఆర్పిన నీటికి ఉడికిపోయి ఎలా మాడు అన్నం తయారయిందో! కొన్ని వందల బస్తాల బియ్యం, చోళ్లు, పప్పులు, కందులూ, మినుములూ, పెసళ్లు, వేరుశనగలూ కాలిపోయాయి." అని ఒక ఉద్యోగి చైర్మేన్కి వివరిస్తున్నాడు.

అవును అన్నం మాడిపోయిన చేదువాసన ఇంకా దట్టంగా ఊళ్లో వ్యాపించే ఉంది.

అక్కడ వారితో నడుస్తున్న ఓ తెల్ల దుస్తులాయనకు ఈ దేశం మరి బాగు పడదేమో అన్పించింది. ఈ ఇళ్లు ఎందుకిలా ఒకదాని కొకటి అంటుకున్నట్టు కట్టుకోవాలి? ఈ ఆహారధాన్యాలు ఎందుకింత అజాగ్రత్తగా ఇళ్లల్లో అట్టేపెట్టు కోవాలి? వాడెవడో పాతికవేలరూపాయలు నోట్లకట్టలు కాలిపోయి నందుకు ఎందుకు గుండె ఆగి చచ్చిపోవాలి? బ్యాంకులో దాచుకోవద్దా? ఆ డబ్బే వాడి ప్రాణం తినేసిందికదా? పాతిక వేల రూపాయలు అగ్గిపాలయి పోయింది కదా! పంట తమకు కావలసినంత ఉంచుకుని మిగిలినది అమ్మేసుకుంటే ఎంత బాగుండును. ఇళ్లు విడివిడిగా దూరదూరంగా కట్టుకుంటే, వీధులు దూరదూరంగా ఉంటే ఇంతనష్టం జరిగేది కాదు గదా! మంచి ఇళ్లు — ఆర్.సి.సి ఇళ్లు కట్టుకుంటే ఈ ప్రమాదం అసలు జరిగేదా? ఏ ఒకటి రెండు ఇళ్లతోనో ముగిసేది కదా. ఆ పాతిక వేల రూపాయలతో అయిదు ఆర్.సి.సి ఇళ్లు కట్టుకోవచ్చుకదా? గంగిరెద్దులా మెడల్లో ఆ బంగారం ఎందుకు? మంచి తిండినన్నా తింటారా వీళ్లు? ఈ జనం బుద్ధి ఎప్పుడు మారుతుంది? ఈ దేశం ఎప్పుడు బాగుపడుతుంది? ఈ ముఖాలు సంతోషంతో ఎప్పుడు కళకళలాడుతాయి? అతడి ప్రశ్నలన్నీ అమాయకమైనవే కావచ్చు. ఈ పరిస్థితులకూ, సమస్యలకూ పరిష్కార మార్గాలు తెలీక పోనూవచ్చు. కాని దీనాతి దీనమైన ఆ జనం అమాయకత, మూర్ఖత్వం, అజ్ఞానం చూస్తుంటే మనసు కల్లోలమై ఈ ప్రశ్నలను రేపింది.

తీరిగ్గా ఆనందంగా ఆటలు ఆడుకుంటూ పాడుకుంటూ కనిపించవలసిన పువ్వుల్లాంటి చిన్నపిల్లలు ఆకలి కళ్లతో, అలసిన ముఖాలతో, తట్టల్తో బూడిద మోసుకుంటూ పోతున్న దృశ్యాలు. స్నానం చేసినట్టూ లేదు. తిండి తిన్నట్టూలేదు. నిద్ర పోయినట్టూలేదు. ఆపద ముంచుకొచ్చి మనుషుల్లో ఉన్న కాస్తంత ఆశనూ ధైర్యాన్నీ తోడేసింది. రంగులు మాసిపోయి చినిగిపోయి విరిగి పోయిన పాతబొమ్మల్లా ఉన్నారు.

"అక్కడ పశులసాల ఉండేది బాబు. దాంట్లో రెండెడ్లు. మా గనమయిన ఎడ్లు. నాలుగొందలు ఇస్తామన్నారు. మొన్నంటే మొన్న— అమ్మనన్నాడు. అమ్మలేదు. ఎడ్లంటే — ఈ ఊళ్లోగాని ఈ చుట్టుప్రక్కల ఐదారు ఊళ్లల్లో అలాంటి ఎడ్లున్నాయా?"

చైర్‌మేన్ పక్కకి వచ్చి ఇంకో ఛోటా నాయకుడు చెప్తున్నాడు.

"ఆ ఇంట్లో ముప్పయ్యేళ్ల ఆడమనిషి కాలిపోయింది. పాపం ఇద్దరు పిల్లలు!

తండ్రికూడా లేదు. ఇంట్లో డబ్బు ఉండిపోయిందని గుర్తొచ్చి లోపలకి వెళ్లింది. అంతవరకూ ఉండీ లేనట్టు ఉన్న మంట అంతలోనే ప్రచండంగా లేచి ఇంటిని చుట్టేసింది.”

ఎంతఘోరం జరిగిపోయిందో అక్కడున్న అందరికీ అర్థమవుతూనే ఉంది. ఆ బాధ ఏమిటో చెప్పనక్కర లేదు. కళ్లముందు కనబడుతున్న దృశ్యాలే అక్కడి భీభత్స విషాదాలను చెపుతున్నాయి. పొగచూరినగుండెలు ఉక్కిరిబిక్కిరై కొట్టుకుంటున్నాయి.

ఊరు కాలిపోవడం అయితే నిన్ననే కాని పట్టణంలో ఉన్న అధికారులకు తీరికచిక్కడం ఈ రోజే. చైర్‌మేన్ శంఖచక్రయుగమున్ చేదోయి సంధించ కుండానే వచ్చాడు. చైర్‌మేన్‌తో పాటు ఇతర అధికార్లు వచ్చారు. కాలిపోయిన వీధులన్నీ తిరిగి, ఇళ్లన్నీ చూసి చైర్‌మేన్ చేసే సహాయం ఏమిటో అని జనం ఎదురు చూస్తున్నారు.

వీధుల్లోంచి నడిచి పోతున్న ఆ గుంపులో తన చేతుల కుర్చీ ఒకనిపిస్తూనే ఉంది. ఎక్కడా చైర్‌మేన్ ఆగలేదు. ఆ కుర్చీని కిందికి దించలేదు. కూర్చోలేదు. కుర్చీని మోసుకుంటూనే పోతున్నాడు ఒక బక్క చిక్కిన మనిషి.

రెండేళ్ల క్రితం మాట. ఒక రోజున రెవెన్యూ ఇనస్పెక్టర్ వచ్చాడు రామ్మూర్తి ఇంటికి. అరుగు మీద చాప పరచి దానిమీద బొంత వేసి కూర్చోమన్నాడు ఆయన్ని రామ్మూర్తి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పాంట్ మడతలు నలిగిపోతాయని అక్కడ కూర్చోలేదు. ఎదురింటి అరుగు మీద కుర్చీ కనిపించటంతో అక్కడకు వెళ్లి ఆ కుర్చీలో కూర్చున్నాడు. ఆ రోజున రామ్మూర్తికి కుర్చీలో ఉన్న గౌరవం హోదా సంగతీ, ఇంట్లో కుర్చీ అవసరం సంగతీ తెలిసింది. ఊరుకు వచ్చీపోయే అధికారులు ఉండనే ఉంటారు. వాళ్లకు మర్యాద చెయ్యాలి. ఇంటిగౌరవం కోసం ఇంట్లో ఒక కుర్చీ ఉండాలి. భార్యకు ఈ నగలన్ని ఎందుకు చేయిస్తున్నట్టు, ఈ ఖరీదయిన ఇంట్లో కుర్చీ లేకపోవటంవల్లకదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వచ్చి తన ఇంట్లో కూర్చో లేదు. ఎదురింట్లో కుర్చీ కనిపించటం వల్లకదా ఆరై అక్కడకు వెళ్లి ఆ కుర్చీలో కూర్చున్నాడు. ప్రకాశం అంటే పడదు రామ్మూర్తికి. అయినా ప్రకాశం ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. ఫోర్‌పెర్సెంట్ లోన్ అన్నాడు. ఆరై గవర్నమెంట్ ఆర్డర్స్ అన్నాడు. ఊళ్లో రైతులందరి దగ్గరా డబ్బు వసూలు చేశాడు. ఆ రోజు ఎదురింటికి రామ్మూర్తి పోవలసి వచ్చింది.

తర్వాత పక్షం దినాలకు రామ్మూర్తి ఈ కుర్చీని పట్నం నుంచి తెచ్చుకున్నాడు. చేతులకుర్చీ. ఊళ్లో ఇంత అందమైన కుర్చీ ఎవరింట్లోనూ లేదు. పెద్దలూ, అధికారులూ, నాయకులూ ఎవరన్నా ఇంటికి వస్తే బావుండును గదా అని రామ్మూర్తి

ఆరోజు నుండి ఎదురుచూడసాగాడు. పెద్దలూ, నాయకులూ, అధికారులూ ఊళ్లోకి రావటం వచ్చారు కాని తన ఇంటికి రాలేదు. బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీస్ వాళ్లు ఊళ్లో ఒక శిక్షణ శిబిరాన్ని పెట్టినప్పుడు పెద్ద అధికారులు ఎవరో వస్తున్నారని రామ్మూర్తిని అడిగి ఈ చేతుల కుర్చీని తీసుకు వెళ్లారు. అడగ్గానే సంతోషంగా ఇచ్చాడు రామ్మూర్తి. తీరా వాళ్లు ఆ కుర్చీని తీసుకుపోయిన తర్వాత బెంగపెట్టుకున్నాడు. పొరపాటునో, ఈర్ష్యతోనో, అసూయతోనో, పడనివాళ్లు కుర్చీని విరగ్గొట్టరుకదా అన్న అనుమానం కలిగింది. రామలింగేశ్వరస్వామి రక్షించి, ఇంటికి భద్రంగా తిరిగివచ్చింది తన చేతుల కుర్చీ.

కుర్చీ తెచ్చిన తర్వాత దాదాపు మూడు మాసాలు దాన్ని ఇంట్లో అలంకారంగా పెట్టాడే తప్ప ఎప్పుడూ దానిమీద కూర్చోవాలనికూడా అనిపించలేదు. ఎవరో అధికారులో, నాయకులో, పెద్దమనుషులో వస్తే వారికోసం తప్ప తన కోసం కాదు అన్నది రామ్మూర్తి ఆలోచన. ఇంట్లో ఖాళీ కుర్చీని చూసినప్పుడుకూడా రామ్మూర్తికి సంతోషంగా ఉండేది. గొప్ప పదవిలో ఉన్న అధికారి ఆ కుర్చీలో కూర్చున్నట్టే అన్పించేది. కుర్చీలో తాను కూర్చోకపోయినా ఆ కుర్చీ తనదీ అన్న భావం మనసులో నాటుకు పోయింది. అప్పట్నించీ రామ్మూర్తికి అధికార స్పృహకూడా తోడయింది. అయితే తనలో తనకు తెలీకుండానే ప్రవేశించిన ఆధిక్యతాభావం గురించి మాత్రం గుర్తింపు కలగలేదు. కంబార్లమీద, భార్యమీద కోపం ఎక్కువయింది. అసహనం, విసుగు పెరిగాయి. ముందూ వెనకా ఆలోచించడం తగ్గిపోయింది.

ఓ సారి సరదా అన్పించి భార్యను ఏడిపించడానికి ఆమెను ఎత్తుకుని వెళ్లి బలవంతంగా కుర్చీలో కూర్చోబెట్టాడు. ఆమె కూర్చోకుండా సిగ్గుపడి లేచి పోతుంటే కోప్పడ్డాడు. బతిమాలాడు. ముద్దు చేశాడు. కుర్చీ ఎవరో ఆఫీసర్ కోసం తెచ్చుకోలేదు. మన కోసం తెచ్చుకున్నాం. అని పెళ్లానికి నచ్చచెప్పాడు. పెళ్లాన్ని ఆ కుర్చీలో చూసి చాలా సంతోషించాడు. గర్వపడ్డాడు. ఆ రోజు భార్య ఎంతో అందంగా కన్పించింది. ఎంతో ఠీవిగా కన్పించింది. దేవతలాగా కన్పించింది. మహారాణిలాగా కన్పించింది. కుర్చీ సింహాసనం అన్పించింది. ఈ గొప్పతనం, ఆ గౌరవం, ఆ హోదా, ఆ ఘనతా —కుర్చీ ఇంట్లోకి వచ్చిన నాటినుంచీ రామ్మూర్తిని ఉత్తేజ పరచసాగాయి. అయినా భార్య మాత్రం సిగ్గుతో నవ్వేసి, ఈ ప్రేమ భరించలేనట్టుగా కుర్చీనించి దిగిపోయేది. అట్లా సంతోషహేతువు కూడా అయిందా కుర్చీ రామ్మూర్తికి.

కుర్చీలో కూర్చోదగ్గ యోగ్యతగల పెద్దలు ఎవరూ తన ఇంటికి రాలేదు. తెచ్చిన తర్వాత గ్రామ నాయకుల శిక్షణ శిబిరంలో తప్ప ఆ కుర్చీని బైటికి ఎప్పుడూ ఎవరికీ ఇవ్వనూలేదు.

సంవత్సరం క్రితమే అతడి తలిదండ్రులు —రెండు నెలలు ముందూ వెనకగా — ఇద్దరూ చనిపోయారు. వాళ్లు కొడుక్కి అప్పులూ, బాధలూ ఏం మిగల్చలేదు. వ్యవసాయం పనులు చూసుకోవడం, ఇంటి పనులు చేసుకోవడం తప్ప ఊళ్లోవాళ్లతో తిరిగి తగువులు తెచ్చుకోవటం, పేకాటలో కూర్చోవటం వంటి దురలవాట్లేమి లేవు. ఆ విషయంలో అతడి భార్యకి సంతోషం. కన్న వారింటికి వెళ్లినప్పుడల్లా మొగుణ్ని పొగుడుతుంది.

ఆ కుర్చీ అవసరం ఇన్నాళ్లకి ఇవ్వాళ మళ్లీ వచ్చింది.

చైర్‌మేన్ ఎక్కడా ఆగినట్టులేదు. అందుచేత ఎక్కడా ఆ కుర్చీని కిందికి దించలేదు. ఆ మోసే వాడిచేతులు నొప్పెట్టినట్టు కూడా లేదు. చైర్‌మేన్ వెనక గుంపుగాపోతున్న జనం లోంచి కుర్చీ కనిపిస్తూనే ఉంది. కాలిపోయిన వీధులన్నీ మొండి గోడలతో కనిపిస్తూనే ఉన్నాయి. ఆ దక్షిణపు వీధులు కొంచెం పల్లం. అందువల్ల మనుషులు మొత్తంగా కనిపించక పోయినా తలల మధ్యనించి, రంగు రంగుల తలపాగాల మధ్యనించి వెల్లకిలా కుర్చీ మాత్రం కనిపిస్తూనే ఉంది.

కుర్చీని కిందికి దించి ఆ కుర్చీలో జిల్లా పరిషత్ చైర్‌మేన్ కూర్చుంటే చూడాలని కనిపెట్టుకుని చూస్తున్న రామ్మూర్తికి నిరాశగా ఉంది. విసుగ్గా ఉంది. పాపం ఎంతసేపట్నించి మోస్తున్నాడో ఆ మనిషి. కూర్చోనిదానికి వెనకాలే ఆ కుర్చీ తీసుకుపోవడం దేనికి? ఆ కుర్చీని ఒక మనిషి తమ వెంట మోసుకొస్తున్నట్టు కూడా వాళ్లు గమనించినట్టు లేదు. కుర్చీ అక్కర్లేదోయి అనేస్తే చాలదా? తప్పయి పోయింది. వాళ్లు వచ్చి అడిగిన వెంటనే తీసుకుపోండి అని వాళ్లకు ఇవ్వడం పెద్ద తప్పు. వాళ్లు వచ్చి అడగటంతోనే ఇచ్చాడు. చెరువు గట్టుకు దిగువున పడమరగా రామ్మూర్తి ఇల్లు. రావి చెట్టుకింద చైర్‌మేన్ వచ్చిన వెంటనే కూర్చొని మాట్లాడుతాడని , దగ్గర్లో ఉన్న రామ్మూర్తి ఇంటినించి ఆ కుర్చీని ప్రశిడెంట్ తెప్పించాడు. ప్రశిడెంట్ ఇల్లు దూరం. అందువల్ల రామ్మూర్తి ఇల్లు దగ్గర కదా అని కుర్చీని తెప్పించుకున్నాడు. పైగా కుర్చీ కొత్తది. ఎంతో నాజూకయిన కుర్చీ. జిల్లా పరిషత్ చేర్‌మేన్ అంతటి గొప్ప నాయకుడు తమ ఊరు వచ్చినప్పుడు కుర్చీ కావాలని పెద్దలు అడిగినప్పుడు ఇవ్వడం మర్యాద కదా అనుకున్నాడే తప్ప - కుర్చీ — ఖాళీ కుర్చీతో ఊరేగుతారనుకోలేదు.

తన చేతులకుర్చీ దిష్టిబొమ్మలా కనిపిస్తున్నదే తప్ప సింహాసనం లాగ కనిపించలేదు.

కాలిపోయిన వీధులన్నీ చూసిన తర్వాత వాళ్లంతా తిరిగి గ్రామానికి తూర్పున ఉన్న చెరువు గట్టుమీది రావిచెట్టు కిందికి వచ్చారు. కుర్చీని మోస్తున్న వాడు అక్కడ దించాడు కుర్చీని. కుర్చీని కిందికి దించి అమ్మయ్య అని నిట్టూర్చి ఉంటాడు. అంతలోనే గ్రామప్రశిడెంటూ, గ్రామమునసబూ, కరణమూ, పెద్దకాముడూ, ప్రకాశమూ అంతా కలిసి చైర్‌మేన్‌నీ, ఆయనతో వచ్చిన అధికారులనీ, ఇతర అనుచరులనీ విందు కోసం తీసుకువెళ్లారు. రాకరాక చైర్‌మేన్ తమ ఊరు వచ్చారాయె! గౌరవ మర్యాదలతో ఆదరించకుండా పంపించడం బాగుండదు. అవమానం. పైగా చైర్‌మేన్‌తో తమకు ముందు ముందు ఎన్నో అవసరాలున్నాయి. ఆయనతో చేయించుకునే పనులు ఉండనే ఉంటాయి. దానికి తోడు ఇప్పుడు మధ్యాహ్నం భోజన సమయం. చేర్‌మేన్ దాదాపు ఎనభై కిలోమీటర్ల దూరంనించి ప్రయాణం చేసి వచ్చాడు. ఉదయం పూట పలహారంచేసి బయల్దేరిఉంటాడు. ఇప్పుడు ఇక్కడ భోజనం ఏర్పాట్లు చెయ్యకపోతే దగ్గర్లో భోజనం చేయగల పట్నం ఏదీ లేదు. ఆ దృష్టితో విందు ఏర్పాట్లు ప్రశిడెంట్ ముందే చేశాడు. తిరిగి వెంటనే వెళ్లిపోవాలన్న ఉద్దేశంతోనే చైర్‌మేన్ రావిచెట్టుకింద ఉన్న కారు దగ్గరకు వచ్చాడు. గ్రామ ప్రశిడెంట్ — విందు ఆరగించి వెళ్లవలసిందని ఒత్తిడిచేసి — వాళ్లందర్నీ తమ ఇంటికి తీసుకుపోయాడు. ఈసారి ఆ గుంపులో గ్రామస్థులు చాలామంది ఆచెట్టు కిందనే ఆగిపోయారు.

వాళ్లతో పాటు ఆ కుర్చీకూడా అక్కడే ఉండిపోయింది.

"సగం ఊరు కాలిపోయి తాగటానికి గంజికూడ లేకుండా జనం ఆకలితో చస్తుంటే వీళ్లకు విందులు? విహారాలూనా" అనుకున్నాడు రామ్మూర్తి. అధికారులు వచ్చి సాయం చేస్తారని కొండంత ఆశ పెట్టుకున్న జనానికి నాయకులు ఏ అభయమిచ్చి ఓదారుస్తారో ఊహించలేకపోతున్నాడు రామ్మూర్తి. పదవికోసం ఎదుటి ప్రత్యర్థిని లక్షలు పెట్టి ఓడించగల చేర్‌మేన్ ఈ అగ్నిబాధితుల కోసం తప్పని సరిగా పెద్ద సహాయమే అందజేస్తారని జనం ఆశపెట్టుకున్నారు. అదీకాక ఈ చైర్‌మేన్ మంచివాడు అనికూడా విన్నారు. గొప్పకుటుంబంనించి వచ్చినవాడు కాబట్టి డబ్బుకు కక్కుర్తిపడే మనిషి కాదు. ప్రజలకు సేవ చెయ్యాలన్న సంకల్పంతోనే రాజకీయాల్లో అడుగు పెట్టాడని కూడా ప్రతీతి. అధికారులను వెంటబెట్టుకుని చైర్‌మేన్ ఊరు రావటమే ఈ జనం చేసుకున్న పుణ్యం అనుకున్నారు. పదవికి వచ్చి ఏడాదే

అయినప్పటికీ అతడి పద్ధతులు మెప్పుపొందుతున్నాయని మెచ్చుకోవడం కనపించింది. మంటల్లో బతుకులు మాడిపోయిన ఈ దీనుల అదృష్టం బాగుపడిందనే అందరికీ ఆశ కలిగింది. అందుకని ఆ చెరువు గట్టు మీద రావిచెట్టు కింద చేరిన జనం చైర్‌మేన్ ఏం చెప్పుతాడో విందామని, ఆ విందునించి అతడి రాకకోసం ఎదురు చూస్తున్నారు.

తన ఆ కుర్చీ మాత్రం కారుకు దగ్గర్లో అంటరాని దానిలా పడి ఉన్నట్టు రామ్మూర్తికి అన్పించింది. పని అయిపోయింది కదా. తిరిగి పంపించేయవచ్చు కదా? ఇంక ఎందుకట్లా అక్కడ ఉంచినట్టు. ఏమో? విందునించి తిరిగి వచ్చిన తర్వాత కూర్చుని ఊళ్లో ఇల్లు కాలిపోయిన బాధితులను ఉద్దేశించి చైర్‌మేన్ మాట్లాడతాడో ఏమో.

రావిచెట్టు కింద చేరిన జనంలో కొంతమందికి చైర్‌మేన్ అంటే మంచి అభిప్రాయం లేదు. పదవికోసం లక్షల్లక్షలు రూపాయలు ఖర్చుపెడ్తాడేమో గాని ప్రజల సహాయం కోసం అంత ఖర్చు పెడ్తాడా అని కూడా వాళ్లకు సందేహంగా ఉంది. దానికి తోడు ప్రశిడెంట్ ఇచ్చే విందుభోజనానికి వెళ్లడం కూడా అసందర్భంగా వాళ్లకి తోచింది. చైర్‌మేన్ ఇచ్చేదేమన్న ఉంటే నేరుగా గ్రామ ప్రశిడెంట్ చేతిలోనే పెట్టాడంటే అది స్వాహా అనే వాళ్ల అభిప్రాయం. ఊళ్లో ప్రశిడెంట్ తన పార్టీవాళ్లకి లాభం కలిగేట్టు చూస్తాడే తప్ప ఎదురు పార్టీవాళ్లకు చిల్లిగవ్వకూడా చేరనివ్వడు అని కూడా వాళ్లకి గట్టిగా తెలుసు. అందుచేత ఏం జరుగుతుందో చూడాలని కూడా ఆ మనుషులు అక్కడ కాపలా ఉన్నారు. గ్రామానికి ఇచ్చే సహాయం ఆ ప్రశిడెంట్ చేతిలో పడకుండా చూడాలనికూడా వాళ్ల జాగ్రత్త. కాలిపోయిన ఊరును చూట్టానికి వచ్చిన ఈ నాయకుడు ఇక్కడ సమస్యను ఎలా పరిష్కరిస్తాడో తెలుసుకోవాలని కూడా వాళ్లకు ఉంది. సరే జరగబోయేది చూడాలి అని తమ తమ అనుమానాల గురించి వాళ్లల్లో వాళ్లు చెప్పుకున్నారు.

రామ్మూర్తి చూశాడు.

రావిచెట్టు నీడలో దిక్కులేని దానిలా కుర్చీ పడి ఉంది. దాన్ని ఎవరూ పట్టించుకున్నట్టు కన్పించలేదు. పిలిచారని పెళ్లికి వెళ్తే పలకరించనన్నా పలకరించలేదంట. అట్లా ఉంది దాని కథ.

దాదాపు రెండు గంటల వ్యవధి తర్వాత —

నిన్న ఆ ఊరుమీద మంటలు కక్కిన సూర్యుడు ఇవాళ నిప్పులు కురుస్తున్నాడు.

చెరువు గట్టు మీంచి ఊరు దిశగా బరువు బస్తాలతో రెండెడ్ల బండి రావటం కన్పించింది రామ్మూర్తికి. బండివాడు తప్ప ఆ బండిమీద మరొకమనిషి ఎవరూ లేరు. రావి చెట్టుకింద కారు పక్కనించి తన కుర్చీ పక్కనించి ఆ బండి ఊళ్లోకి వచ్చింది. రావి చెట్టుకింద జనం ఆ బండివాడిని చాలా ప్రశ్నలు అడిగారు కాని ఆ బండివాడు ఏ సమాధానమూ చెప్పినట్టులేదు. తిన్నగా ఆ బండి వచ్చి తన ఇంటిముందు ఆగింది.

పై ఉత్తరపు వీధిలోంచి చెరువు గట్టెక్కారు జిల్లాపరిషత్ చైర్మేన్, అతడితో వచ్చిన ఇతర అధికారులూ, గ్రామ ప్రెశిడెంటూ, గ్రామాధికారులూ, ఇంకా ఇతర నాయకులూ, అనుచరులూ — దాదాపు పదహేను ఇరవైమంది.

ప్రెశిడెంట్ గొంతూ, ఎవరిదో నవ్వూ, మరొకరి బ్రేవ్‌మన్న తేన్పూ, ఇంకెవరిదో గొంతు సరిచేసుకుంటున్న దగ్గూ, నడకలో చెప్పుల చప్పుడూ, మరెవరిదో తుమ్మూ వినిపించాయి రామ్మూర్తికి.

'బండిని ఆ వేప చెట్టు నీడలోకి తీసుకెళ్లు... ఎండ.... బక్కలకు కాసింత చల్లగా ఉంటాది' అన్నాడు రామ్మూర్తి.

'ఏమిటా బస్తాలు?' బండి వాడిని అడిగాడు రామ్మూర్తి

'బియ్యం బస్తాలు కంట్రాక్టరు బాబు పంపించినారు.'

ఊళ్లో అగ్నిబాధితులకు పంచి పెట్టటానికి బియ్యం బస్తాలు కంట్రాక్టర్ పంపించిన సంగతి రామ్మూర్తికి అర్థమయింది. ఆరు బస్తాలున్నాయి. కంట్రాక్టర్ ఎండ తగ్గిన తర్వాత వస్తాడట.

కంట్రాక్టర్ అంటే ఆ ప్రాంతంలో అందరికీ తెలిసినపేరే. మోటర్‌సైకిల్ తో తిరుగుతుంటాడు. మాదొడ్డ మనిషి అంటారంతా. ఊళ్లోని కమ్యూనిష్టులు మాత్రం వచ్చేసారి ఎమ్.ఎల్.ఏ గా నిలబడాలని వాడికి ఉందని — అందుకే ఇట్లాంటి సహాయాలు చేస్తుంటాడని అక్కసుతో అంటుంటారు. ఊళ్లో కంట్రాక్టర్‌కి మించిన సంపన్నులు కనీసం అయిదాదుగురన్నా ఉంటారు. తన ఇల్లులాగానే వాళ్ల ఇళ్లుకాలి పోలేదు. కాని ఏ ఒక్కడూ కాలిపోయిన ఇండ్లవాళ్లకి గత రాత్రిగాని ఈ ఉదయంగాని ఇంత గంజి పొయ్యలేదు. ఎవరికి వాళ్లు వాళ్ల వాళ్ల బంధువులు ఇళ్లల్లోనో, తెలిసిన వాళ్ల ఇళ్లల్లోనో రాత్రి భోజనాల ఏర్పాట్లు జరిగాయే తప్ప — ప్రత్యేకంగా బాధితులు అందరికీ ఏ ఏర్పాటు జరగలేదు. రాత్రి, ఉదయం, ఇప్పుడు గంటకిందట వరకు రామ్మూర్తి ఇంట్లో ఓ పదిహేనుగురు వరకు — కింది వీధి వాళ్లు వచ్చి భోజనాలు

చేశారు. భార్య ఆ పనిలోనే ఇంకా ఉంది. కొంతమంది వాళ్ల సామానులూ, పెట్టెలూ, మూటలూ, గంపలూ, బుట్టలూ తెచ్చి పెట్టుకున్నారు. వాటితో ఇంటి ముందు పశువులసాల నిండిపోయింది. ముసలాళ్లు ఇద్దరు ఆ సాలలోనే ఓ మూల ఇంకా కూర్చునే ఉన్నారు. మిగిలిన వాళ్లంతా ఆ కాలిపోయిన ఇళ్లు — సర్దుకోవటానికి వెళ్లారు. ఈ మండుటెండలో కూడా వాళ్లకు ఇంత విశ్రాంతి లేదు. రామ్మూర్తి ఈ ఎండలో ఎక్కడకు వెళ్తారని వాళ్లను కోప్పడ్డా వాళ్లు రామ్మూర్తి మాట వినలేదు.

చైర్‌మేన్ రావిచెట్టు నీడన విశ్రాంతి తీసుకుంటున్న తన కారు దగ్గరకు ఆ గుంపుతో పాటు చేరాడు. వీడ్కోలు. వెళ్లిపోయే ముందు ప్రభుత్వ సహాయం గురించి తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరలోనే అందజేసేట్టు కృషి చేస్తానని హామీలు, అభయాలు, సానుభూతి వచనాలు చెప్పి ధైర్యం నూరిపోస్తు న్నట్టున్నాడు. అధికార్లు కూడా అక్కడ చేరిన వాళ్లతో మాట్లాడుతున్నారు.

అంతలో గ్రామ ప్రశిడెంట్ తమ్ముడొకడు పరుగు పరుగున అక్కడకు వచ్చాడు. అతడి చేతిలో ఉన్న కాగితాలను చైర్‌మేన్ చేతికి ఇచ్చాడు. ఆ యువకుడు ఇరవై ఏళ్లవాడు. ఈ మధ్య ఉద్యోగాల కోసం దరఖాస్తులు పెట్టుకుంటున్నాడు. అట్లాంటి దరఖాస్తు తెచ్చి — ఆ దరఖాస్తు మీద సంతకం కోసం చైర్‌మేన్‌కి ఇచ్చినట్టున్నాడు. సంతకం పెట్టటానికి సదుపాయంగా ఒత్తుకు ఏదీ లేదు. చైర్‌మేన్ పక్కనే ఉన్న కుర్చీమీద కుడికాలు పెట్టి, తొడమీద దరఖాస్తు ఉంచి సంతకం కావలసినచోట్ల సంతకం చేసి, ఇచ్చేసి, అందరికీ మరొకసారి చేతులెత్తి నమస్కారం చేసి, కారు వెనక సీట్లోకి వెళ్లి కూర్చున్నాడు. ఆయనతో వచ్చిన అధికారులు కూడ అదే కారులో కూర్చున్నారు. కారు కదిలిపోయింది. అంతలోనే పొలాల మధ్యనించి, మామిడితోట దగ్గర మలుపు తిరిగి కారు కనుమరుగయి పోయింది.

అధికారులూ, చైర్‌మేనూ వచ్చి చూసిన తర్వాత ఒరిగిందేమిటో అర్థంకాని ఓ తలపాగా నడివయసు రైతు 'ఆళ్లు సెప్పిన మాటలు నాకు తెలలేదు — కాని ఏమైనా యిచ్చినారా?' అని ఆశతో అడిగాడు.

'అవున్రా ఇప్పుడు కాలిపోయిన ఊళ్లో నష్టం ఎంతో సూట్టానికి వొచ్చినారు. ఎల్లి ఏం సాయం సెయ్యాలో ఆలోసించి సెప్తార్రా.' అని ఇంకో తలపాగా చిన్నవయసు రైతు జవాబు చెప్పాడు.

'అంటే?' అని సందేహంలో పడ్డాడు ఇంకో చినిగిపోయిన బనీను తొడుక్కున్న ముసలిరైతు.

‘అవును ఊరు కాలిపోయిందో లేదో సూట్టానికి వొచ్చినార్రా. ఊరు కాలిపోయిందని, కాలిపోయిన మాట నిజమే అని ఆళకి ఇప్పుడు తెలిసింది’ లుంగీ చొక్కా యువకుడు ఒకడు వివరించి చెప్పాడు.

‘చేర్‌మేన్ ఏమివ్వడా?’

‘ఆడి సొంత సొమ్మా?’

‘మరి కాకపోతే మన సొమ్ము ఇయ్యడానికి ఈడెందుకు రావాల?’

‘మన సొమ్మెక్కడిదిరో?’ ఓ కోర్టు పక్షి.

‘ఓర్నాయినా ఎలక్షన్‌లకయితే లక్షల్లక్షలు కరుసు పెట్టారు కాని దరమానికి పైసా వొదల్లేరు. ఎందుకొచ్చిన ఆశ సెప్పండి. ఎవడి కర్మ ఆడిది. ఆడు... ఆడు ఇచ్చేస్తాడు మన కడుపు నిండి మన ఆకలి తీరిపోతాదా? అంత దరమం లోకంల ఉండి రాజ్జెం నడిస్తే జనాలకి ఈ కష్టాలెందుకు? నెలకు నాలుగువానలు పడకపోనా? ఇది కలియుగంరా నాయనా కలియుగం. ఆ మాట మరిచిపోతన్నా రంతా. అది గేపకం పెట్టుకోం కదా? మన కర్మాన రాసిందే మనకు దక్కదు. లేకపోతే ఈ అగ్గిదేవుడికి ఈ కోపం ఎందుకు రావాల ? ఈ ఇళ్లన్నీ దేనికి కాలిపోవాల? నోటిదగ్గర ముద్దే తన్నుకెల్లిపోయినాడు బగమంతుడు. ఇక కొత్తగా ఇవ్వడ మెక్కడరా నాయినా.’ అన్నాడు మరో తలపాగా పెద్దవయసు పెద్దమనిషి.

ఆ వచ్చిన చైర్‌మేన్‌నీ, అధికారులనీ ఓ బూతు తిట్టు తిట్టి ‘ఈళ్లొచ్చి మనల్ని తినేస్తున్నారు. తప్పించి మనకు సాయం మాట ఒట్టిదే నాయినా’ అన్నాడు. వచ్చిన అధికారులకూ, చైర్‌మేన్‌కూ విందుభోజనం పెట్టి మర్యాద చేసిన గ్రామ ప్రశిడెంట్.

అధికార్లు ఉన్నంతసేపూ వారికి గొడుగు పట్టి వాళ్లు దారిపట్టి మరుగయిన వెంటనే గ్రామస్థుల గొడుగు పట్టే నేర్పు ప్రశిడెంట్‌కి ఒక్కడికే చెల్లు. ప్రశిడెంట్ అంతటితో ఊరుకోలేదు “ఆ విందు ఖర్చుతో పాతికబళ్ల కర్రలు కొనొచ్చు. పాతికిళ్లు నిలబడేవి. కాని... మర్యాదకదా. జిల్లా పరిషత్ చైర్‌మేన్ అయింతర్వాత మన ఊరు రావటం ఇదే తొలిసారి... ” అని గ్రామ ప్రజలపట్ల తనకున్న సానుభూతిని చూపించుకోవటంతో పాటు గ్రామప్రశిడెంట్‌గా తనకున్న బాధ్యతగానూ, మొత్తం గ్రామానికి ఉన్న బాధ్యతగానూ మాత్రమే ఆ వచ్చిన వారి పట్ల మర్యాదకోసం విందు ఏర్పాటు చేయటం జరిగిందని సంజాయిషీ చెప్పుకున్నాడు. అది విందులకూ, వినోదాలకూ తగిన సమయం కాదన్నది తనకు మాత్రం తెలీదా అన్నది ఆ సంజాయిషీ అంతరార్థం.

రామ్మూర్తికి రాత్రంతా నిద్రలేదు. ఓ పక్క ఇంటినిండా జనం. సాలనిండా జనం. తమకు కలిగినంతలో రాత్రి వాళ్లకి భోజనం పెట్టాడు. అట్లా వాళ్లకు సేవచేయగలిగినందుకు రామ్మూర్తి సంతోషపడ్డాడు. రామ్మూర్తి పెళ్లాం కూడా చాలా సంతోషపడింది. ఇరుగుపొరుగువాళ్లు ముగ్గురునలుగురొచ్చి వంటల్లో వడ్డనల్లో సాయపడ్డారు. రాత్రంతా ఇంటినిండా సందడి. నిద్రపట్టలేదు. ఇప్పుడు నిద్ర ముంచుకు వచ్చినట్టయి లోపల గదిలో మంచం మీద చేరబడ్డాడు.

రామ్మూర్తి నిద్రలేచే సరికి ఎండ చల్లారింది. కళ్లు తెరిచే సరికల్లా గదిలో కన్పించే కుర్చీ — కన్పించలేదు. గదిలో కుర్చీలేదు. ఇంకా కుర్చీ రాలేదా? తెచ్చి ఇవ్వలేదా? ఏమయింది? ఎక్కడుంది? అన్న ప్రశ్నలతో బైటికి, పశువుల సాల గుమ్మందాటి వీధిలోకి వచ్చి చూస్తే రావిచెట్టుకింద కుర్చీ కన్పించింది. రామ్మూర్తి ఇంటికి పాతిక గజాలు దూరంలోనే ఉందా రావి చెట్టు. ఆ చెట్టు కింద ఎవ్వరూ లేరు. ఆ కుర్చీ మాత్రం యుద్ధరంగంలో పరాజయం పొందిన శత్రువు శవంలాగ అక్కడే పడి ఉంది.

రోషం వచ్చింది రామ్మూర్తికి.

ఆ కుర్చీని కొని ఇంటికి తెచ్చుకున్న తర్వాత రామ్మూర్తి నిత్యం దాన్ని చూస్తూ పొందిన సంతోషం, గర్వం, వైభవం అతడిలో ఇప్పుడు ఏ మాత్రం మిగల్లేదు. పగటి రంగురంగుల అందాలు చీకటిలో మాసిపోయినట్టు అతడి ఉత్సాహం నీరుకారి పోయింది. అవమానంతో సిగ్గుతో చిన్నతనంతో గిలగిల తన్నుకున్నాడు. వీధిలో దెబ్బలు తిని వచ్చిన కొడుకును ఇంటిదగ్గర మరిరెండు దెబ్బలు కొట్టి శిక్షించిన తండ్రి మనస్తత్వం ఏర్పడింది. సమాజంలో తమ పరువు మర్యాదలు పోయాయన్న విపరీతమైన ఆత్మాభిమానంతో, ఆవేశంతో చచ్చిపోయినా బాగుండును కదా అనుకున్నట్టు ఆ కుర్చీ నిన్నటి మంటల్లో కాలిపోయి ఉంటే బావుండును అన్పించింది. ఆకుర్చీ తనుకొని తెచ్చుకున్న సింహాసనం లాగ, తను సంపాదించుకున్న పదవిలాగ, తనకు లభించిన కీర్తిలాగ, తన ఆత్మలోని ఒక రుచిలాగ ఇప్పుడు, ఈ నిమిషాన రామ్మూర్తికి కనిపించలేదు. దుర్మార్గమైన అధికార దురహంకారానికి, అజ్ఞానానికి, సంకుచిత స్వార్థం వల్ల కలిగిన ఆనందానికి, వ్యామోహానికి ఒక గుర్తుగా కన్పించ సాగింది.

ఆ కుర్చీని ఇంటికి తెచ్చుకోకూడదు అనుకున్నాడు రామ్మూర్తి. దాన్ని ఎవరన్నా తెచ్చి ఇంట్లోపెట్టే వెంటనే విరగ్గొట్టి ముక్కలుముక్కలు చేసి పొయ్యిలో పెట్టేయాలని

పించింది. మనసునిండా కోపం. ఆ కుర్చీ తనను చూస్తున్నట్టుగా ఉంది. ఆ చూపులకు తట్టుకోలేక రామ్మూర్తి బైటనించి లోపలికి వెళ్లిపోయాడు.

లోపలికి వచ్చిన భర్త ముఖం మీద పేరుకుపోయిన ఉక్రోషాన్నీ, ఆవేశాన్నీ చూసింది. "ఏమిటి ఏమయింది. అలా ఉన్నారు" అని అడిగింది భార్య. నిర్మలంగా, అమాయకంగా, ముద్దుగా ఉండే అతడి తీరులో మార్పు ఆమె పసికట్టింది.

దయ్యాలూ భూతాలూ కలలో కన్పించితే జడుసుకున్నట్టుగా ఉందామెకి.

ఆ రోజు సాయంత్రం సాలలో చూస్తే కుర్చీ కన్పించింది. ఎవరో తెచ్చిపెట్టి పోయినట్టున్నారు. ఆ సాలలో ఎవరూ లేరప్పుడు. కుర్చీని అమాంతం పైకెత్తి నేలకేసి బలంగా కొట్టాడు. కుర్చీ విరగలేదు. బంతిలాగ ఎగిరిపడింది. రెట్టింపు కోపంతో, ఆవేశంతో, పౌరుషంతో మళ్లీ కొట్టాడు నేలకేసి. ఈ సారి కూడా కుర్చీ చెక్కు చెదరలేదు. సిగ్గుపడ్డాడు రామ్మూర్తి. అవమాన పడ్డాడు. మూడోసారి మరింత బలంగా కొట్టాడు. కుర్చీ ముక్కలు ముక్కలయింది. ఓ ముక్క ఊడి అతడి మోకాలి ఎముక మీద బలంగా తగిలింది. ప్రాణం పోయినంత నొప్పయింది. రెండోసారి శబ్దం విని ఈ చప్పుడు ఏమిటా అని వంటింట్లోంచి రామ్మూర్తి భార్య పరుగు పరుగున వచ్చేసరికి కుర్చీ విరిగి నేలమీద ముక్కలు ముక్కలై పడి ఉంది. భర్త ముఖం మీద పిచ్చి ఉద్రేకం కనబడింది.

రామ్మూర్తి విరిగిన కుర్చీ ముక్కలన్నీ తీసుకుపోయి పొయ్యి దగ్గర పడేశాడు.

పొయ్యి మండుతున్నది. కసితీరా రెండు ముక్కల్ని పొయ్యిలో పెట్టేశాడు.

రామ్మూర్తికి వెంటనే ఏడుపు ఉప్పొంగి వచ్చింది. అట్లాగే ఆవంట గదిలోనే ద్వారం దగ్గర నేల కూలిపోయాడు. దు:ఖం ముంచుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉన్నాడు.

కుర్చీకి ప్రాణం వచ్చినట్టుంది.

కుర్చీ పసి పిల్లవానిలాగ ఏడుస్తున్నట్టుగా కనిపించసాగింది రామ్మూర్తికి. దాంతో రామ్మూర్తి దు:ఖం రెట్టింపు అయింది. కుర్చీ తన వేపే చూస్తున్నది. ఆ చిన్నారి చేతులతో తన కాళ్లను చుట్టేసి తన కళ్లల్లోకి చూస్తూన్న పసిపాపలా ఏడుస్తూ ఉంది ఆ కుర్చీ.

★★★

– ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక జూన్ 1966